చవితి చంద్రుడు

"అన్నీ మీ అన్నయ్య బుద్ధులే"
అన్నాడు గోపాలం.

ఈ మాట గోపాలం ఎప్పుడన్నా రుక్మిణి మాట్లాడదు. మాట్లాడలేక పోవడానికి కారణం ఆమెకూ తెలియదు. తెలిసింది చెప్పడానికి తగ్గ మాటలు కంఠంలో ఆగిపోతాయి తప్ప బయటకు రావు. ఆగిపోయిన మాటలు ఆమె - భర్త నిద్రపోతున్న క్షణంలో గుర్తుకు తెచ్చుకుంటూ వుంటుంది. యెవరూ విననప్పుడు పైకే అనుకుంటుంది. చాలాసార్లు అలా అనుకున్న తర్వాత తన నెవరో వోదార్చినట్టుగా వుండేది.

గోపాలం మాటలకు రుక్మిణి జవాబు చెప్పకపోయినా కొడుకు ప్రకాశంమాత్రం జవాబుగా యేడుస్తూనే వున్నాడు. ప్రకాశం యేడవడానికి కారణం అతను స్కూలుకు వెడుతూ తండ్రి జేబులో పావలా చెప్పకుండా కాజెయ్యడం, పైగా ఆ విషయం అడిగితే తియ్యలేదని అనడం గోపాలానికి చిరాకు తెప్పించింది. ఆ అనుమానానికి ఆజ్యంగా పనిచేసింది- కొడుక్కన్నీ మేనమామ శివరావు బుద్ధులు అబ్బుతున్నా యనే భయం. అందుకే కొట్టాడు.

"వెధవ తీసుకున్నా నని చెప్పకూడదూ." అది గోపాలం వాదన.

"నే నిజంగా తియ్యలేదు."

"పోనీ తియ్యలేదేమో-వూరుకోకూడదూ" అంది పైకి రుక్మిణి. కానీ లోపల అనుకుంది "వాడి నెందుకు అన్నయ్యతో పోలుస్తా"రని బాధగా.

రుక్మిణికి అన్నయ్య శివరావు అంటే తండ్రికన్నా గౌరవం. అన్నగారితో కలిసే రుక్మిణి యెలిమెంటరీ స్కూలు నుంచి హైస్కూలువరకూ-చెల్లాయిగా-స్నేహితురాలిగా-తల్లిగా- ఆరిందాగా నడిచివెళ్ళింది.

పాఠాలు చదవలేక నిద్ర ముంచుకొచ్చిన రాత్రి, హోంవర్కు లెక్కలు తికమక పెడ్తూంటే - తాటాకు బొమ్మలు అందంగా అమరకపోతే, శివరావు ఆమెకు గోడమీద ఫొటోలో భద్రాద్రి రాముడిలా కన్పించేవాడు

తల్లి తిడితే, అన్నయ్యలు కోప్పడితే
వెళ్ళి శివరావుతో చెప్పి యేడ్చేది.
అన్నయ్య వెళ్ళి తల్లివైపు అర్భకపు

కోపంతో చూస్తూంటే చిన్నరుక్మిణి
'మా అన్నయ్య' అనుకునేది.
అలాంటి అన్నయ్యతో తన చదువు

ఘోర్తుఘోరంతో దూరమయింది. తల్లీ దండ్రీ కలిసి చదువు మాన్పించిన రోజున-రాత్రి తను కార్చిన కన్నీరు యింకా గుర్తుకు వస్తూనే వుంటుంది. తనతోపాటు అవతలి గదిలో అన్నయ్య కూడా అలాగే తెరిచిన పుస్తకం తడిసిపోయేటట్టు కన్నీరు కార్చాడని తెలిసి - లేచి వెళ్ళి 'పోనీ లే అన్నయ్యా' అనా లనుకుంది. కానీ శివరావే వచ్చి అన్నాడు.

"పోనీవే- నే స్కూల్లో చదువుకు వచ్చి నీకు ప్రతి సాయంకాలం పాఠాలు చెబుతాను, చదువుకుంటూ వుండు."

భయంగా చూసింది తను.

"యెవరితో చెప్పనులే" అన్నాడు నవ్వుతూ.

ఉదయం వొంటరిగా స్కూలుకు వెళ్ళలేక శివరావూ- వొక్కత్తే వాకిట్లో కూర్చుని రుక్మిణీ — గాలి పటాల్లాంటి వూహాలుమాత్రం అల్లుకో సాగారు... అప్పుడే శివరావుకు కొత్త స్నేహితుల పరిచయం కల్గింది. కబుర్లు చెప్పడం గ్రౌండ్ కు వెళ్ళి ఆటలు ఆడ్డం అలవాటయ్యాయి....

యెదిగీ యెదగని వయసులో స్నేహితుల ప్రభావం ప్రతి విద్యార్థి మీదా పనిచేస్తూనే వుంటుంది. ఆ పని ప్రవాహంలోనే కొత్త అలవాట్లు నేర్చుకోవడం - పాతవి తెలియకుండానే కొట్టుకుపోవడం జరుగుతుంది. ఆ అలవాట్లే మనిషిని జీవితాంతం వేపుకు తింటాయని అనుకోక పోయినా - మనిషి మరోమలుపు తిరిగేవరకూ — జీవితం కుబుసం విడిచేవరకూ మాత్రం మనసుమీద పనిచేస్తా యని వొప్పుకు తీరాలి.

చలపతి హైస్కూల్లో ప్రవేశించకుండానే చెడుతిరుగుళ్ళకి - బీడీలు కాల్చడానికి అలవాటుపడ్డ వ్యక్తి. ఆ అలవాటు - చిన్నప్పుడు చలపతికి ఉబ్బసం వస్తే డాక్టరు చుట్ట నేర్పమనడంతో - పక్కన కూర్చోబెట్టుకుని తండ్రి కాల్పించేవాడు. కొంత కాలానికి జబ్బు మాయమయింది గాని చలపతికి అలవాటు యెదిగి కూర్చుంది.

అందుబాటులో వుండే తండ్రి చుట్టపెట్టె అందకుండా తాళం వున్న అల్మరాలో పెట్టి నిద్రబోతున్నా—తల్లి గారం అందుతూవుండడం మూలంగా చలపతి కొంతకాలం మామూలుగానే వున్నాడు.

కానీ తనిచ్చే అణాల వెనుకచరిత్ర తల్లి పసిగట్టడంతో కొడుక్కి యిచ్చిన చనువు వెనక్కి తీసుకుంది.

చలపతి మాత్రం - యిరుకయిన దార్లో నడవలేని పాదాల్లా — నొండి ఆటలో అవుట్ చెయ్యలేని కుంటి వాడుగా — పాఠంరాని విద్యార్థిలా

తికమకపడ్డాడు. ఆ తికమకే అతన్ని చిన్నరకం జేబు దొంగతనానికి – అదీ యింట్లో – అలవాటు చేసింది. సరిగ్గా యీ సమయంలోనే – తండ్రి జేబులో మర్చిపోయిన అణాలూ – డార్లో దొరికిన పావలా కాసులా, శివరావు స్నేహం అనుకోకుండా లభించింది.

శివరావుకు చెయివాటుతనం అలవాటు చేకూరిందని చలపతి అనుకుంటే అది పొరపాటవుతుంది. చలపతి వో వారంరోజులు దాటిన తరువాత – తన అలవాటు ప్రకారం శివరావు జేబులో బేడ తీసుకుని గప్‌చిప్పుగా వూరుకున్నాడు. స్కూలునుంచి తిరిగి వచ్చేటప్పుడు చలపతి, "హోటల్‌కు వెడదాం రా" అన్నాడు. శివరావు తనదగ్గర డబ్బు ల్లేనందుకు – బేడ పోయినందుకు వుదయంనుంచీ బాధ పడుతూనే వున్నాడు. నిజానికి అతను చలపతిని అనుమానించాడు. కానీ అడగలేక, మొహమాటంకొద్దీ పోయిందని కూడా చెప్పలేకపోయాడు.

ఇద్దరూ కాఫీ తాగిన తరువాత నాలుగణాలు చలపతే చెల్లించాడు. అలవాటు ప్రకారం సిగరెట్లు కూడా కొన్నాడు.

వొక్క బేడమాత్రం చలపతి జేబులో వుంటుందనీ, బహుశా అది తనదే ననీ తర్కవితర్కం చేసుకుంటున్న శివరావు–అతను ఆరణాలు ఖర్చు పెట్టడంతో – తన బేడ దొంగిలించింది చలపతి కాదనుకున్నాడు.

ఓ రోజు సాయంకాలం చలపతి శివరావును "పావలా కావాలిరా" అని అడిగాడు.

"నాదగ్గర బేడ వుంది" అన్నాడు అమాయకంగా శివరావు.

"నాకూ తెలుసు నీ దగ్గర బేడ వుందని – అది చాలదు."

"మరి యెలా ?"

"మీ నాన్నగార్ని – పోనీ అమ్మగార్ని –"

"నా న్నివ్వరు. ఇది అమ్మిచ్చిన బేడే... మళ్ళీ యివ్వదు."

"చెల్లాయి...."

"దానిదగ్గర డబ్బు లుండవు."

చలపతి శివరావును చూసి నవ్వి అన్నాడు "మీ నాన్నగారి జేబులో వుంటాయి."

"మనదగ్గర వుండగా – అయినా దొంగతనం తప్పు" అన్నాడు.

"ఇది దొంగతనం కాదురా శివం. నీ దగ్గర రూపాయి వుండగా నీ అవసరం రూపాయిపైన వుంటుంది. మిగిలింది సంపాదించాలికదా. పైగా నీదగ్గర రూపాయి వుండడం మూలంగా మిగిలింది నువ్వు యెత్తుకుపోయావని యెవరూ అనుకోరు కూడా." అని అంతవరకూ తనింట్లో పట్టుబడకుండా యెలాతప్పించుకునేదీ,

యెలా డబ్బులు బయటకు తెచ్చేదీ చెప్పాడు.

అంతే. తండ్రి నియమాలమధ్య - వోట్టి ఆప్యాయతగా చూసే తల్లిమధ్య అలా శివరావుకు చిన్నరకం దొంగ తనాలు అలవాటయ్యాయి. తరువాత అది గట్టి అలవాటే అయిందికూడా.

శివరావును యింట్లో వాళ్ళందరూ అనుమానించిన రోజూ, తిట్టిన క్షణం తనే ఆ చెడుపని చేసినట్టు యేడ్చేసింది రుక్మిణి. కానీ వో రోజు పరీక్షగా చూసింది. అంతకుపూర్వం అన్నగారి జేబులో వున్న అర్ధరూపాయి - రూపా యిగా మారింది. అన్నగార్ని యెలా అడగాలో, నిలదియ్యాలో ఆమెకు తెలియలేదు. పైగా చిన్నదాన్ననే వయసు ఆమెను శివరావుకు దూరం చేశాయి.

రుక్మిణికి పెళ్ళయి కాపురానికి వెళ్ళవలసిన రోజు-శివరావు కాలేజీలో చేరవలసిన సమయం వో కే సారి వచ్చాయి. వీలు చూసుకుని అన్న య్యతో మాట్లాడాలని ఆమె నిశ్చయం చేసుకుంది.

తన ప్రాణంలో ప్రాణం - తన వూహాలకు రంగులు పులుముకుంటే— రెక్క లిస్తే - అందంగా అలంకరిస్తే మొదట ఆమెకు ఆరాధ్య దైవంగా అన్నయ్యే కనిపిస్తాడు. అలాంటి అన్నయ్య మచ్చగా - మసకలో నడ వడం గుర్తొచ్చి మెలుకువలో-నిద్రలో దేవుణ్ణి నిందించాలో -అతనిలోమార్పు కోసం ప్రార్థించాలో మర్చిపోయింది.

"అన్నయ్యా! మా వూరు వస్తూం టావా అప్పుడప్పుడు?"

"వో!"

"అన్నయ్యా!"

"ఆ...."

"అమ్మ నీ గురించి బాధపడు తోంది రా."

"యెందుకుట ?"

రుక్మిణికి యెలా చెప్పాలో తెలియ లేదు. "వుత్తరం వ్రాస్తాను" అంది అదోరకంగా.

"ఫరవాలేదు చెప్పు...."

"నువ్వు చిల్లర దొంగతనాలు మానెయ్యవూ" అంది వెంటనే.

తడబడుతూ అన్నాడు "ఛా-ఛా- నే దొంగతనం చెయ్యడ మేమిటి"అని.

"నాకు తెలుసు - అదిగో అబద్ధం దేనికి" అంది యేడుపు ఆపుకోలేక అవతలిగదిలోకి వెళ్ళిపోతూ.

మనిషి తప్పు చేసినా యెవరూ గుర్తించలేదనుకున్నప్పుడు బ్రతుకులో వంకర లన్నీ మర్చిపోయి నిటారుగా నడుస్తాడు. అది యెదటివాడు గుర్తిస్తే సగం వంగిపోతాడు. శివరావు స్థితి అంతే అయ్యింది.

శివరావు అలాగే కూర్చుండిపోయి భయంగా గొణుక్కుంటూ "దీని కెలా

కాకా గారు వీరేనండి వీరి పూర్తిపేరు కాంతాకనకనేని కామకోటీశ్వరరావు అని చాలామందికి తెలవనే తెలవదు కాకాపట్టి వ్రాయడంలో వీరికి వీరే సాటి!"

తెలిసిం దబ్బా" అనుకున్నాడు మరునాడు కాలేజీకి వెడుతూ యెవరితోనైనా చెబుతుందేమో" లోపల అనుకున్నాడు. చలపతిని చూడగానే వోగంట కబుర్లు చెప్పగానే "నే అంటే దానికి అభిమానం వుంది. యెవరితో యీ విషయం చెప్పివుండదు" అని నిర్ధారణ చేసేసుకున్నాడు.

ఆ నిర్ధారణ కొచ్చిన మూలంగా - శివరావు మానసిక జాడ్యం హరించుకుపోవడంబదులు హెచ్చు పెరిగిపోయింది. తరుచు హాస్టల్లో యెవరో వొకరి జేబుల్లో డబ్బులు దొంగిలిస్తూనే వున్నాడు.

నిజానికి శివరావుకు అదో గ్లామరూ, హాబీ అయిపోయింది. ఆ హాబీకి వంత పాటగాడు చలపతి. తమకు యింటి దగ్గరనుంచి వచ్చిన డబ్బు విచ్చలవిడిగా టేబిల్ మీదా పుస్తకాల్లోనూ పడెయ్యడం-ఆ డబ్బును విలువలేనిదానిగా చూసి నటనగా తిరగడం మొదటి మెట్టు. తద్వారా యెవరూ వీళ్ళని అనుమానించేవారు కారు.

పక్క రూమ్స్‌లో వాళ్ళు హడావిడిగా వున్న సమయాల్లో వాడిదగ్గర నుంచి వొకటీ రెండూ కాజెయ్యడం-వాడు యెలా పోయిందనే ప్రశ్నను విప్పుకోలేక బాధపడుతూంటే-చాటుగా వుమ్మడిగా యిద్దరూ నవ్వుకునేవారు. అది వారి ఆనందానికి ఆఖరి మెట్టు.

యీ విషయం మొదట పసిగట్టిన వాడు రఘురాం అని వో ఫైనలియర్ స్టూడెంట్. జేబులో పదిరూపాయల

నెంబర్స్ నోట్ చేసుకుని అత నో రోజు ట్రిక్ చెయ్యడం - యధావిధిగా శివ రావు ప్రవర్తించడం జరిగిపోయాయి. దానికి తోడు శివరావు రఘురాంని కూడా కాఫీకి ఆహ్వానించాడు.

ఆ సాయంకాలం రఘురాం వెరిఫై చేసుకుంటే నిజం తేలింది. రఘురాం రోజంతా ఆలోచించాడు. మనిషి అవసరం తీరక అవకతవక పన్లు చేస్తాడు. ఆ అవసరం మరీ భయపెడితే భయంకరమైన పన్లు కూడా చేస్తాడు. అంతవరకూ తెలుసు.

కాని శివరావు దగ్గర స్వంతం అనేది కొంత వుండడం-పైగా అనవసరపు దొంగతనంలోని ఆవశ్యకత యేమిటో అతనికి రాత్రిచాలాసేపు ఆలోచించినా అంతుచిక్కలేదు. మరునాడు యిద్దరు ముగ్గురు స్నేహితులతో చెప్పినా యెవరూ నమ్మలేదు. కొందరు శివ రావును వెనకేసుకొచ్చారు. 'స్టడీస్'లో నీ'రేంక్'ని మించిపోయా డని ఈర్ష్య అన్నారు.

అప్పటికే బావమరిది ప్రవర్తన గురించి విన్న గోపాలానికి-రఘురాం-సంశయనివృత్తికోసం చెప్పిన కథ బాధే కాదు, అవమానాన్నికూడా కల్గించింది.

రఘురాంకు గోపాలం వరసకు అన్నయ్య అవుతాడు. అన్నీ చెప్పి ఆఖర్ని అన్నాడు.

"క్షమించు అన్నయ్యా...శివరావు నీ బావమరిది అని తెలుసు-కానీ...."

రఘురాం అబద్ధం ఆడ్డంలేదని గోపాలానికి తెలిసింది .... అందుకే అన్నాడు....

"శివరావు పూర్తిగా దొంగ అని నేనూ నమ్మలేకపోతున్నాను. అతనికి అదో అలవాటు. చిన్నతనం నుంచీ మనిషిలో అవసరాల్ని నొక్కిపెట్టా లనుకుంటే మానసిక ప్రవృత్తి యిలాగే విజృంభిస్తుంది. జ్వరం తగ్గినవెంటనే పత్యంబదులు పిండివంటలతో భోజనం చేసినా- మహారాజుదగ్గర ఆయుధా లన్నీ లాక్కుని-సంకటి జావా, తుంగ చాపా యిచ్చినా ఆ మనుష్యుల్లో కూడా యింతేప్రళయం రేగుతుంది."

"అయితే అతను అవసరం కోసం దొగలించడంలేదుగా" అన్నాడు రఘురాం

"లేదనుకో- ఆలోచిస్తే- అతన్ది 'గ్లామర్ తెఫ్టింగ్' అనాల్సివస్తుంది. దానివల్ల లభించేది మానసికానందం తప్ప బాహ్యానందం లేదనే చెప్పుకో వాలి. వేళకి భోజనంచెయ్యడం యెంత అవసరమో - శరీరంలోపల జరిగే - అంతర్గతంగా పుట్టే అలజడిని ఆపు చేసుకోవడానికి కూడా మనిషి అంతే స్ట్రగుల్ అవుతాడు.....అవసరం లేక పోయినా యెదటిమనిషి అవసరాన్ని దొంగిలించి - అతనికి చిరాకు కల్గించి-

ఆ చిర్నాకుతో తను మౌనరాగాలు వింటాడు....''

"అయితే యీ జాడ్యానికి మందేమిటి....యిలాంటివాళ్ళు యెక్కడ ఆగుతారు. ఆఖరికి వీళ్ళందరూ దేశానికి 'ఐక్ మెన్స్'లా తయారవరంటావా అన్నయ్యా" అన్నాడు రఘురాం భయంగా.

''చూద్దాం'' అన్నాడు గోపాలం.

* * *

సుఖస్వప్నాలు కంటున్న ఆశాజీవి వదనంలావుంది పెళ్ళివారిల్లు. అలికి ముగ్గులు పెట్టిన వాకిళ్ళలా వున్నాయి పెళ్ళివారి మనసులు. ఆడవాళ్ళు — అటూ యిటూ తిరగడం చూస్తూంటే యింద్ర ధనస్సులు ప్రాణం పోసుకున్నట్టుగా వుంది. అక్కడక్కడ వెలుగుతున్న గాస్ లైట్ మేంటిల్స్ మంచుగడ్డ కట్టినట్టుగా కన్పిస్తున్నాయి. దానిచుట్టూ పురుగుల్లా మగవాళ్ళు వూగిసలాడుతూ చీట్లాటలో మునిగివున్నారు.

చీరలు కడుతున్న చప్పుళ్ళు - వుండుండి సెంటు గుభాళింపు - దూరంగా గదుల్లోంచి పల్చబడి విన్పించే నవ్వు - రహస్యంలా మారి వినబడే మాటలు - చంటిపిల్లల మారాములూ — చూస్తూంటే వివాహం తంతుకూడా వోరకమయిన యుద్ధమే అన్పిస్తుంది. ఈ యుద్ధంలో సంఘర్షణలన్నీ ముఖస్తుతిలోకి జారి - కక్షలన్నీ ఆప్యాయతగామారి - అనురాగంలోకి ప్రవహిస్తూ, ఆఖరికి యిద్దరు మనుష్యుల్ని కలిపి - తాము వుక్కిరిబిక్కిరయి, తదాత్మ్యం పొంది తుదిగా యెవరికివాళ్ళు విశ్రాంతికోసం అన్నట్టు తమ శిబిరాల్లోకి వెళ్ళిపోవడం జరుగుతుంది. ఆనందంకోసం, ఆప్యాయతకోసం కూడా మనుష్యులు శాంతి యుద్ధాలు వాంఛిస్తారని - పెళ్ళిళ్ళకి వచ్చి తృళ్ళిపడే మనుష్యుల్ని చూస్తే నిజం అన్పిస్తుంది.

అయితే యీ శాంతి యుద్ధానికి ఆయుధాలు లేకపోయినా - యుద్ధమే కనుక - గాయాల్లాంటి, అలకలు — ఓటమిలాంటి సరదా యెత్తిపొడుపులు వోకరికొకరు కల్గించుకుంటూనే వుంటారు.

భగవాన్లు అంతరాత్రి హడావిడిగా లోపలినుంచి వాకిట్లోకి వచ్చి "అమ్మాయిదేదే" అన్నాడు.

"సీతమ్మగారితో చెప్పివస్తానని వెళ్ళింది-ఇంతకీ యేమిటీ కంగారు" అంది రామమ్మగారు.

యింతలో విశాలాక్షమ్మగారు కంగారుగా లోపలినుంచి "పెట్టెలో డబ్బు కన్పించటం లేదండీ" అంది.

"అయ్యో — అయ్యో"

"సరిగ్గా చూడు — యెక్కడ పెట్టావో. తాళం సరిగ్గా చూసుకో

మని పోరుతూనే వున్నాను.'' అంది అత్తగారు.

''ఇప్పుడే తాళం తీసి అలా వెళ్ళానంతే''...

అందరూ చేరారు - ''యెలా పోయింది?'' ''యెంత?'' ''యెప్పుడండీ?'' ''ఆశ్చర్యం!'' ''ఘోరకలి!'' లాంటి పదజాలాన్ని వదుల్తూ.

రామమ్మగారు అంతమందికీ యేడుస్తూనే సమాధానం చెప్పింది. గోపాలం వచ్చాడు.

''చూడుబాబూ – అంత దూరం నుంచి మీ యింట్లో పెళ్ళికదా అని వచ్చాం. మా డబ్బే పోవాలా?'' అనేసింది.

యింతలో రుక్మిణి వచ్చింది....

''యెలా'' అన్నాడు భగవాన్లు,

ఆ పెళ్ళికి పెద్దలు గోపాలం రుక్మిణీ కావడం మూలంగా అందరూ వాళ్ళ నిర్ణయంకోసం అన్నట్టు చూస్తున్నారు.

''సరిగ్గా మరోసారి చూడు మామయ్యా'' అన్నాడు గోపాలం.

యింతలో హడావిడిగా రఘురాం - అవతలి గదిలోంచి శివరావు రావడం ఒకేసారి జరిగింది.

''పిళ్ళడబ్బు పోయిందిట - వంద రూపాయలు'' అన్నాడు - గోపాలం భార్యవైపుచూస్తూ, రుక్మిణీ ఆ భావానికి తట్టుకోలేక నేల చూసింది.

''రైలుస్టేషన్ నయం-పెళ్ళివారింటికన్నా సేఫ్టీ'' అన్నాడో బంధువు.

''మా డబ్బు తిన్నవాడు మట్టి కొట్టుకు పోతాడు.''

శివరావు అందరివైపూ చూసి-మౌనంగా అక్కడినుంచి వెళ్ళి పోయాడు.

''అతను నీ బావమరిది కదూ'' అన్నాడు భగవాన్లు.

''అవును-అతని పేరు శివరావు'' అన్నారు మరొకరు.

''మరోసారి పెట్టంతా వెదకండి-రండి'' అంది రుక్మిణి.

''నీపిచ్చిగాని దొరుకుతుందంటావా అమ్మా - అదప్పుడే యెన్ని చేతులు మారిపోయిందో.''

రుక్మిణీ, విశాలాక్షమ్మగారూ లోపలికి వెళ్ళారు. రఘురాం, గోపాలం మాట్లాడుకోలేక వొకరి నొకరు చూసుకున్నారు.

ఆ దొంగతనం గురించే అందరూ వింతగా చెప్పుకుంటున్నారు.

సీతమ్మగారు కోడలు రావడం చూసి ''దొరకలేదా'' అంది.

''లేదు'' అంది ఆవిడ వస్తూనే. యింతలో శివరావు వచ్చి ''చూడండి పిన్నిగారూ, మీరు అలా వసారాలోకి వెళ్లేరు కదూ'' అన్నాడు.



"ఈయన ప్రముఖ ముఖచిత్రకారుడు..."
"ఓ...చెప్పకుండానే తెలుస్తూనే ఉందిగా..."

"అవున్నాయనా, ప్రారబ్ధంకొద్దీ వెళ్ళేను."

"మరక్కడ పారేసుకుని పెట్టంతా వెదికితే యెలా దొరుకుతుందండీ - యిదిగో అక్కడ పడివుంది" అన్నాడు వందరూపాయల కాగితం అవిడ కిస్తూ.

"యేది, యేది" అంటూ నలుగురూ చుట్టుముట్టారు.

"మంచివాడు కాబట్టి సరిపోయింది, యిచ్చాడు" అంది రామమ్మగారు.

"తీసింది వొకడే అయినా - అనుమానం అందరిమీదా తగుల్తుంది-దొరికింది కాబట్టి బ్రతికిపోయాం."

"మా యింట్లో పెళ్ళికొచ్చి పోగొట్టుకున్నా రన్నమాట తప్పింది-పోనీలెండి" అంది రుక్మిణి అప్పుడే వచ్చి నెమ్మదిగా.

"అదేమిటమ్మా - దొరక్కపోతే యేం చేస్తాం."

శివరావు అప్పటికే లోపలికి వెళ్ళిపోయాడు.

క్షణాల తర్వాత చూసుకుంటే రఘురాంకు - గోపాలానికి వొకరికొకరు కన్పించారు.

* * *

బావా —

నాకు తెలుసు. అసలు నేను మీ యింటిలో పెళ్ళికి రాకూడదనుకున్నాను. యెందుకొచ్చానో నాకా రోజు తెలియలేదు. వచ్చి వెళ్ళిన

తరువాత మాత్రం రావడం మంచిదే అన్పించింది. నాగురించి చెల్లాయి రుక్మిణి చెప్పలేక దాచినా, చాలా మంది దాచుకోలేక నీతో చెప్పి వుంటారు. నన్నేం చెయ్యమంటావు. శరీరంతో పాటు అవయవాలు ఎదుగుతాయి. అలాగే అనుభవాలూ—అలవాట్లూ బలపడి వాటి చుట్టూ కండలు పెంచుకుని మనుష్యుల్నే జయిస్తాయని అన్పిస్తోంది.

చిన్నప్పుడు నాగురించి పట్టించుకునేవాళ్ళు లేరు. నాన్నంటే నాకు భయం. ఆయనకూ నాసంగతి పట్టేది కాదు. యిక అమ్మ చూసీ చూడనట్టు వూరుకునేది. మరోసారి కాఫీ తాగడం కోసం, సిగరెట్లు కాల్చడం కోసం దొంగతనం చేసేవాణ్ణి. జేబులో డబ్బులు వున్నా - యెక్కడైనా డబ్బులుకన్పిస్తే స్వంతం చేసుకోవాలనిపించేది.

ప్రతీ గజదొంగకీ కొంతకాలం పోయేసరికి తన అవసరం మీదకన్నా-నేర్పుమీదా, పనివాటితనం మీదా మమతపుట్టి దొంగతనాలు చేస్తాట్ట. నేనూ అంతే అయ్యాను.

వోసారి సరదాగా స్నేహితుడి జేబులో యిరవై రూపాయలు స్వంతం చేసుకున్నాను. ఆ తరువాత అతనే మమ్మల్ని ఆప్తమిత్రులనుకుని-పోయినడబ్బు గురించి కన్నీరు పెట్టుకుంటే మాకేం బాధకల్గలేదు. కారణం విన్నతరువాత మాత్రం - ఆ కన్నీరు నన్ను అలలు అలలుగా ముంచేస్తోందనిపించింది.

పదేళ్ళనాడు అప్పగార్ని వదిలేసిన బావ - భార్యని విజయవాడ వరకూ తీసుకువచ్చి దిగపెట్టమనీ అక్కడ నుంచి తనతో అంబాలా తీసుకువెడతానని వుత్తరం వ్రాసి డబ్బు పంపించాట్ట.

ఎంతో సంతోషంతో కాపురం గురించి కలలు కంటూ ఆ ఆడదీ - అప్పగారి ఆనందాన్ని వూహించుకుంటూ తమ్ముడూ - స్టేషన్‌కు వెళ్ళి-నిరాశపడి — మరోదారిలేక వెనక్కి తిరిగివస్తే - ఆ తిరిగివచ్చిన మనిషి, తన పాలిటి రాక్షసుణ్ణి — మనిషి రూపంగా వున్న — నాతో చెప్తూంటే నాకు బ్రతకడానికే కాదు చనిపోవడానికి కూడా అర్హత లేదనిపించింది.

నేనెప్పుడూ వొకరి చిరాకులో, కోపంలో ఆనందం చూసేవాణ్ణితప్ప కన్నీటివిలువ యెరుగను. చిన్నప్పుడే అమ్మా నాన్నా నన్నుతిట్టి—నాగురించి కన్నీరు కారుస్తోన్నట్టు తెలిస్తే — నేనిలా మారేవాణ్ణి కాదేమో.

ఆ రోజునుంచీ నాకు తెలియకుండా కలల్లో ఆస్త్రీమూర్తి కన్పించేది. ఆరు నెలలు అదే వూహాలో భయంకరంగా నలిగిపోయాను. ఆ తరువాతే మీ

యింట్లో పెళ్ళికి వచ్చాను సమయం చూసి నీముందు నా తప్పులు ఒప్పుకోవా లనుకున్నాను జరిగింది వేరు నేను మీ మొహం తిరిగి యెలా చూడగల్ను

ఆ డబ్బు నేను దొంగిలించలేదంటే భగవంతుడుకూడా నమ్మడానికి వెనకాడతాడు నువ్వు నమ్మగలవా తిరిగి నిన్ను కల్సుకోవడం జరిగితే అన్నీ చెప్పగల్గిన స్థితికి యెదిగితే—నీ ముందు నా జీవితంగురించి వప్పు చెప్పుతాను

—శివరావు

ఆఫీసులో వుత్తరం పూర్తిచేసి గోపాలం అచేతనంగావుండిపోయాడు. ఫ్యూన్ వచ్చి కాఫీ యిచ్చి వెళ్ళాడు. లీజర్ టైమ్ మూలంగా ఆఫీసంతా నిశ్శబ్దంగా వుంది. అత నొక్కడే బయటకు వెళ్ళంది. యింతలో ఫ్యూన్ వీరాస్వామితో రఘురాం, భగవాన్లూ లోపలికి వచ్చారు.

"రండి భగవాన్లుగారూ - రా రఘూ."

"యేవోయ్ అల్లుడూ కులాసా."

"యిదిగో యిదే కులాసా" అన్నాడు నవ్వుతూ గోపాలం.

"అన్నయ్యా - యీాయన నీతో గమ్మత్తయిన విషయం చెప్పడానికి వచ్చారు."

"యేమిటి?"

"చూడు - ఆరోజు మీ యింట్లో పెళ్ళినాడు వందరూపాయలు పోయి- దొరకాయి గుర్తుందికదూ. మీ బావ మరిదికి గాడిపొయ్యిదగ్గర దొరికింది నోటు."

"అవును."

"తీరా యింటికి వెళ్ళి మా ఆవిడ చూసుకుంటే మరో వందరూపాయల కాగితం పసుపుబట్టలో కన్పించింది. అప్పగింతల హడావిడిలో అందులో పెట్టిందిట."

"ఆ...."

"తరువాత గుర్తుచేసుకుంది ... యింతకీ అతనికి దొరికిందని యెలా యిచ్చాడంటావ్ ."

రఘురాం అప్పటికే ఆ విషయం విన్న మూలంగా అర్థం అయినట్టు చూస్తున్నా - గోపాలం తికమకగానే వున్నాడు.

రఘురాం అన్నాడు "అది యెవ రిదో అయివుంటుంది" అని.

అలా రఘురాం చెప్పినా గోపాలానికి సమస్య అంతుపట్టలేదు. రఘురాం చెప్పడం మొదలుపెట్టాడు. గోపాలం బాధగా చూశాడు.

సాయంకాలం యింటికి వెళ్ళి కుర్చీలో కూర్చునేసరికి రుక్మిణి కాఫీ తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టింది.

"రుక్మిణీ అలా కూర్చో."

"యేం?"

"మీ అన్నయ్య వుత్తరం వ్రాశాడు" అని వుత్తరం అందించాడు.

రుక్మిణి వుత్తరం పూర్తిచేసి కదలి కలు పోగొట్టుకున్న ట్టయిపోయింది.

"మీ అన్నయ్య మారేడంటావా?"

"నే నేం చెప్పగల్ను" అంది... సాదాగా.

"మన యింట్లో పెళ్ళిలో.. " అని మొదలుపెట్టి అంతా గుర్తుచేసి - భగవాన్లు యిచ్చిన వందరూపాయలు చూపిస్తూ —

"అయితే రుక్మిణి - మీ అన్నయ్య యెందుకు తన స్వంత డబ్బు యిచ్చాడంటావు. పాపం తనని అనుమానించారని అలా చేసివుంటాడు .... నిజం. అందరూ యేమిటి, నేనూ అతనే తీసివుంటా డనుకున్నాను. యివ్వకపోతే పక్కకు పిల్చి చివాట్లు వెయ్యాలనుకున్నానుకూడా."

రుక్మిణి వింటోన్నట్టు చూస్తోంది.

"మీ అన్నయ్య మారినందుకు యింకో స్థితిలో అయితే ఆనందించేవాణ్ణి. కానీ-అతనికి మనపట్ల యెంత భయం యేర్పడితే అలా చెయ్యాని నేరానికి తలొగ్గుతా డంటావు. ఆలోచిస్తే మనం అసహ్యంగా వూహించినందుకు సిగ్గుపడాల్సి వస్తోంది" అన్నాడు తలపట్టుకుని.

"అవును. మీరేకాదు అందరూ." తొందరగా లేచి లోపలికి వెళ్ళిపోయింది రుక్మిణి. వుత్తరం చేతిలో నలిగిపోతూంటే, కన్నీటితో తడుస్తూంటే అనుకుంది.

"అన్నయ్యా; అంతాకాదు, నేను నిన్ను అనుమానించాను. చెయ్యాని నేరం నీకు అంటగట్టి...నిన్ను తిట్టి....

గోపాలం రుక్మిణి కన్నీరు పెట్టుకోవడంచూసి.."యేమిటది రుక్మిణీ- యేడుస్తున్నావా - ఛా ఛా.... మీ అన్నయ్యమీద నాకేం అనుమానంలేదు సరా....వూరుకో...." అనేశాడు. బాధగానే

"లేదండీ...అందరిలా అన్నయ్యను నేనూ అనుమానించాను. లేకపోతే వాడ్నితిట్టి-నేనే ఆ వందరూపాయలు వాడిచేత ఆవిడకు యిప్పించి వుండకపోదును ... యెంత బాధపడి వుంటాడో."

బావురుమనేసింది రుక్మిణి.

గోపాలం క్షణం నిరుత్తరుడయ్యాడు. రుక్మిణి అతని కౌగిల్లో కన్నీటిశిలిక అయ్యింది. సాయంకాలం రఘురాం అన్నమాటలు గుర్తొచ్చాయి గోపాలానికి. వెంటనే—

"అతని వూహామూలంగా నువ్వు నిందమోయాల్సి వస్తుందనుకున్నావు. కాని నీగురించే అతను చెయ్యాని నేరానికి నిందలు భరించాడు..."